
సదరం సర్టిఫికెట్లకు స్లాట్స్ బుక్ చేసుకోవాలి

వికారాబాద్, జూలై 5 : జిల్లాలోని దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లకు నేటి నుంచి స్లాట్స్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈనెల 12, 23, 24, 30, 31 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే సదరం శిబిరానికి దివ్యాంగులు హాజరు కావాలని, 9, 16, 19, 25 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్వహించే క్యాంపునకు స్లాట్‌బుక్ చేసుకున్నవారు హాజరు కావాలన్నారు. 650 స్లాట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



మీకంటే మేమేం తక్కువ కాదన్నట్టు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే లేకుండా బీఆర్ఎస్ అందరినీ తమ పార్టీలో చేర్చుకుంది. ఇప్పుడే ఇదే పద్ధతిని కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తోంది. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అందరినీ తమ పార్టీలో కలుపుకునేందుకు తీవ్రంగా యత్నిస్తోంది. ఇప్పటికే చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కారు దిగి హస్తం గూటికి చేరారు. ఆయన బాటలోనే మరికొందరున్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. దీంతో వీరంతా కాంగ్రెస్‌కు జై కొడతారన్న ప్రచారం సాగుతోంది.

మరో ముగ్గురు జంప్!

- గ్రేటర్ సమావేశానికి పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దుమ్మా
- చేరికలను ముమ్మరం చేసిన అధికార పార్టీ
- రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్న కాంగ్రెస్

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు?

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

అధికార కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్‌ను ముమ్మరం చేసింది. చేరికల విషయంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు వరుసగా షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ త్వరలో మరో షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. అనూహ్యంగా గురువారం అర్ధరాత్రి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను కాంగ్రెస్ తన గూటికి తెచ్చుకున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి అధికార పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై గురిపెట్టినట్లు తెలిసింది. త్వరలో ఆరు లేదా ఎనిమిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కూడా ఉన్నట్లు తెలిసింది. తాజా పరిణామాలు ఈ అనుమానాలకు బలం చేకూర్చే విధంగా ఉన్నాయి. ఇటీవలే చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య అనూహ్యంగా కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విధేయుతగా ఉండే యాదయ్య గుట్టుచప్పుడు కాకుండా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో గులాబీ నేతలు షాక్‌కు గురయ్యారు. తాజాగా గురువారం అర్ధరాత్రి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరి చేరికలు కూడా చివరి క్షణం వరకు గోప్యంగానే ఉంచడం గమనార్హం. అతి త్వరలోనే మరికొందరు ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ప్రచారానికి బలం చేకూరుస్తూ బీఆర్ఎస్‌లో కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. 6వ తేదీన జరిగే జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధారం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి హాజరు కాలేదు. దీంతో చేరికల ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది.

కాంగ్రెస్ రిటర్న్ గిఫ్ట్

గతంలో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలందరినీ బీఆర్ఎస్ తమ పార్టీలో చేర్చుకున్న విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలలేదు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ తమవైపు తిప్పుకోవాలని భావిస్తోంది. బీఆర్ఎస్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు విడతల వారీగా ఎమ్మెల్యేలను చేర్చుకుంటోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా రంగంలో దిగి చేరికలపై కొందరు ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నట్లు తెలిసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ ద్వారాలు తెరిచింది. ఇందుకు పార్టీ అధినాయకత్వం కూడా ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి చేరికలపై దృష్టి సారించారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు వేర్వేరు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఏకాంత చర్చలు జరిపారు. ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ఈ చేరిక విషయాలు చివరవరకు కాంగ్రెస్ గోప్యంగానే ఉంచుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు శివారు ప్రాంతాలకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. అయితే ఇందులో ఒకరు మరికొందరు చేరిన తరువాత చేరతానని.. ముందు చేరడం తనకు ఇష్టం లేదని చెప్పినట్లు సమాచారం. అలాగే శివార్లలో మరో ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరేందుకు ముందు నుంచి ఆసక్తిగా ఉన్నారు. అయితే ఇక్కడ గత ఎన్నికల్లో ఓటమి చెందిన నేత ఆయనను ఢిల్లీ స్థాయిలో అడ్డుకునే యత్నం చేస్తున్నారు.

దశాబ్దం తరువాత సొంత గూటికి...

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఈ స్థానం నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. దాదాపు దశాబ్దకాలం తరువాత తిరిగి ఆయన సొంత గూటికి చేరారు. కాంగ్రెస్‌లో అనేక పదవులు అనుభవించిన యాదయ్య 2014లో కాంగ్రెస్ తరుపున పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. తరువాత ఆయన బీఆర్ఎస్‌లో చేరి 2019, 2023లో ఆ పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. మళ్లీ పదేళ్ల కాలం తరువాత యాదయ్య తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం గమనార్హం. యాదయ్య తన చేరిక విషయాన్ని చివరి వరకు గోప్యంగానే ఉంచారు. యాదయ్య పార్టీ మార్పుపై కొంతకాలంగా ఊహాగానాలు వెలువడుతున్నా ఆయన అదేమీ లేదంటూ ఖండిస్తూ వచ్చారు. ఇటీవల వికారాబాద్‌లో ఆ రోజు జిల్లా పరిషత్ భవన సముదాయం ప్రారంభోత్సవ సభలో యాదయ్య మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో నిధుల విషయంలో కూడా స్వల్పంగా ఘర్షణ పడ్డారు. దీంతో యాదయ్య పార్టీ మార్పుపై ఎవరికీ అనుమానం రాలేదు. ఇటీవల ఆయన మాజీ మంత్రి చంద్రశేఖర్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లారు. ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకునే వరకు చేరిక విషయం గోప్యంగానే ఉంచారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జూలై 5: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఫ్లైఓవర్ , ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్మాణాల పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆసుపత్రి, కళాశాలలకు అవసరమైన సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా త్వరలో ప్రారంభించుకోనున్న ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలతో పాటు నీటివసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం పనులపై ఆర్అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఛైర్ పర్సన్ మంజుల రమేష్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, ఆర్అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఆర్అండ్‌బీ డీఈ, ఈఈలు ఉన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో సేవల గురించి ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్

మెరుగైన వైద్యం అందించాలి

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జూలై 5(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన చికిత్సను అందించాలని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను, ఓపీలను, ల్యాబ్ , ఐసీయూ యూనిట్, ఆక్సిజన్ యూనిట్, ఎక్స్‌రే, ప్రసూతి రూమ్, ప్రత్యేక నవజాత శిశు కేంద్రాలను పరిశీలించి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, వివిధ సమస్యలతో వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఇప్పటివరకు మలేరియా, డెంగీ కేసులు ఎన్ని వచ్చాయని కలెక్టర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సేవల గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రఘునాథస్వామి, వైద్యులు కోటియా నాయక్, సౌందర్యలత, ఆనంద్, సునీత, సంగీత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ బస్టాండ్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు!

- జీవో 10ని రద్దు చేయాలంటూ టీచర్ల ధర్నా

కొడంగల్, జూలై 5: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. శుక్రవారం కొడంగల్‌లో సీఎం ఇంటి ముట్టడి పిలుపు మేరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తరలి వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ శ్రీధర్‌రెడ్డి ఉదయం నుంచి సీఎం ఇంటి దగ్గర బందోబస్తు ఏర్పాటు చేసి అంగన్‌వాడీ టీచర్లను నిలువరించారు. దీంతో అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు స్థానిక బస్టాండ్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మీ, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ 65 సంవత్సరాలు పూర్తయినా అంగన్‌వాడీ హెల్పర్‌లు పది వేల మందికిపైగా పని చేస్తున్నారని తెలిపారు. జీవో నెం.10ని రద్దు చేస్తూ, రిటైర్మెంట్ సమయంలో టీచర్‌లకు రూ.2లక్షలు, హెల్పర్‌లకు రూ.1లక్ష చొప్పున అందించాలన్నారు. మొదటగా కొంత మంది అంగన్‌వాడీ హెల్పర్స్ ఆందోళన చేస్తుండగా వివిధ గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చిన అంగన్‌వాడీలతో కాస్త ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడగా ధర్నా విరమింపజేసేందుకు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి పోలీసు సిబ్బందితో ప్రయత్నించినా వినలేదు. ఆందోళనలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం పోలీసుల అరెస్టులతో కాస్త ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరికి పోలీసులు అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలను, సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పలుచోట్ల భారీ వర్షాలు.. రైతులకు ఉపశమనం



వర్షానికి వీధుల్లో నిలిచిన నీరు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, జూలై 5 :ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొద్ది రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఆందోళనతో ఉన్న రైతాంగం శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కడపటి వార్తలందే సమయానికి వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోల్‌లో అత్యధికంగా 41మి.మీ వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో 40 మి.మీ వర్షం కురిసింది. కుల్కచర్లలో 32.3 మి.మీ, మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 28మి.మీ, కేశంపేటలో 27మి.మీ, మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో 25మి.మీ, సరూర్ నగర్‌లో 24మి.మీ, శేరిలింగంపల్లిలో 22మి.మీ, రాజేంద్రనగర్, యాచారం, మంచాలలో 20మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఇంకా అర్ధరాత్రి కూడా పలుచోట్ల వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

11 ఏళ్ల కల నేరవేరింది

- టీ-20 ప్రపంచ కప్ గెలవడం దేశానికి గర్వకారణం
- భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘనంగా స్వాగతం పలికిన అభిమానులు



శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న క్రికెటర్ సిరాజ్

శంషాబాద్ రూరల్, జూలై 5 : భారత క్రికెట్ అభిమానులు 11 ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల నేరవేరిందని, క్రికెట్ టీ-20 ప్రపంచ విజేతగా నిలవడంతో దేశం గర్విస్తోందని భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ అన్నారు. క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ గెలిచిన అనంతరం శుక్రవారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న సిరాజ్‌కు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అభిమానులు, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ గెలిచేందుకు భారతీయులు 11 ఏళ్లుగా ఎదురు చూశారని, నేడు ఆ కల నేరవేరిందని అన్నారు. భారత క్రికెట్ జట్టు కప్పు గెలవడం చాలా సంతోషంగా ఉందని, హైదరాబాద్‌కు గర్వకారణమని అన్నారు. అభిమానులకు ఇది మరిచిపోని రోజు.. తాను క్రికెట్ టీమ్ కోసం చాలా కష్టపడుతున్నానని, మున్ముందు మరింత కష్టపడి ఉత్తమ ప్రదర్శన చేసి మరిన్ని కప్‌లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా, క్రికెటర్ మహ్మద్ సిరాజ్ వస్తున్నారనే సమాచారంతో.. అభిమానులు భారీగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అభిమాన క్రికెటర్ జై.. భారత్ మాతాకీ జై.. అంటూ నినాదాలు చేశారు. సిరాజ్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో అభిమానులతో సందడి నెలకొంది. అనంతరం ఆయన ప్రత్యేక కాన్వాయ్‌లో నగరానికి బయలుదేరి వెళ్లారు.



సిరాజ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం
- పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

మేడ్చల్ జూలై 5(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలని, సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని మూయించాలని కేంద్రం చూస్తున్నదని ఆరోపించారు. సింగరేణి కాలరీస్‌కు నేరుగా బొగ్గు గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రవి, అశోక్, వినోద, సంతోష్, శ్రీనివాసులు, లింగస్వామి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

మహిళలకు 'మీ సేవ'లు

- జిల్లాలో 16 కేంద్రాల ఏర్పాటు



మేడ్చల్ జూలై 5(ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుని చిరువ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి స్వయం సహాయక సంఘాల సభ్యులతో మహిళాశక్తి మీ-సేవ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అవన్నీ గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాల, రైతువేదికతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రంనిర్వహణ బాధ్యత గ్రామైక్య సంఘాల(వీఓ)కు అప్పగించింది.

స్త్రీనిధి ద్వారా రుణం

మీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన రూ. 2.50 లక్షల రుణం స్త్రీనిధి ద్వారా అందజేస్తారు. అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తీసుకున్న రుణం మీ సేవ కేంద్రం ప్రారంభమైన తర్వాత నెలనెలా చెల్లించాలి. గ్రామైక్య సంఘాల వద్ద డబ్బులుంటే ఆయా పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చు. లేని వారు మాత్రం రుణం పొందవచ్చు.

చదువుకున్న వారు ఎంపిక

గ్రామైక్య సంఘాల్లో(వీఓ) చదువుకున్న సభ్యురాళ్లను మీ- సేవ కేంద్రం ఆపరేటర్లుగా ఎంపిక చేశారు. త్వరలోనే వీరికి కేంద్రం నిర్వహణను, మీసేవ ద్వారా అందించే సేవలపై శిక్షణ ఇస్తారు. జిల్లాలో వందల సంఖ్యలో మీ - సేవ కేంద్రాలున్నాయి. వాటికి తోడుగా ఇంకా పారదర్శకమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

వీవోలకు అప్పగించాం...

మీ-సేవ కేంద్రాల నిర్వహణ మొత్తం మహిళా సంఘాలు చూసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో 16 కేంద్రాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. ఎంపిక చేసిన సభ్యులకు త్వరలోనే శిక్షణ ఉంటుంది. అది పూర్తికాగానే వచ్చే నెల ఆఖరుకు ప్రారంభించేలా చూస్తాం.

సాంబశివరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే జుంటుపల్లి మరమ్మతులు చేపడుతాం

- ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ధర్మ



జుంటుపల్లి ప్రాజెక్టును పనుల గురించి వివరిస్తున్న ధర్మ

యాలాల, జూలై 5: జుంటుపల్లి ప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే టెండర్లు పిలిచి వెంటనే పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ధర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి జుంటుపల్లి ప్రాజెక్టును పరిశీలించారు. దెబ్బతిన్న తూము, కాల్వలను పరిశీలించి వెంటనే ఎస్టిమేట్ వేసి ప్రభుత్వానికి పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జుంటుపల్లి ప్రాజెక్టు కింద దాదాపు 5 వేల ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉండగా ప్రస్తుతం 20 ఎకరాలతోప మాత్రమే నీరు అందుతుదని చెప్పారు. ప్రాజెక్టు తూము కాల్వలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, ముఖ్యమంత్రితో మాట్లాడి వెంటనే నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రాజెక్టు మరమ్మతుల కోసం దాదాపు రూ. 10 నుంచి 15 కోట్లు అవసరమని అన్నారు. ఇప్పటికే కోట్‌పల్లి ప్రాజెక్టు కూడా మరమ్మతుల కోసం స్పీకర్ ప్రసాద్‌కుమార్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్సీ రంగారెడ్డి, ఈఈ సుందర్, సురేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, కరుణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, హనుమంత్, అక్బర్ బాబా, అమృతయ్య, భీమప్ప, పాల్గొన్నారు.



దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


వికారాబాద్: ధర్నా చేసేందుకు వచ్చిన నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

వికారాబాద్, జూలై 5: అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పిన విధంగా దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌ను శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు నెలలు అవుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు వెలగబెట్టిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చినహామీలను అమలు చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. ధర్నా నిర్వహించేందుకు వచ్చిన నాయకులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారు కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, దివ్యాంగ సంఘాల నాయకులు పోతురాజు సుధీర్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన పెన్షన్‌ను అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు అవుతున్నా ఇంత వరకు పింఛన్లు అందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ఒక్కటైన ఏపీలో ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు గడువకముందే అక్కడ పెంచిన పెన్షన్లను అమలు చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు అమలు కావడం లేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా పెంచిన పెన్షన్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు వినయ్, మంగమ్మ, గంగపుత్ర శ్రీను, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


మల్కాజిగిరి: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రోడ్లను కమ్మేసిన ముళ్లపొదలు

● జనగాం, మంబాపూర్, జీవన్గిలో వాహనదారులకు ఇబ్బందులు


పెద్దేముల్: జనగాంలో దారి కనిపించని విధంగా పెరిగిన ముళ్ల పొదలు

పెద్దేముల్, జూలై 5: రోడ్డుపైన ముళ్లపొదలు కమ్మేసి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా బస్సు వస్తే పక్కనుంచి వెళ్లలేని పరిస్థితి ఎదురైంది. ముళ్లపొదలు తొలగించి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని జనగాం గ్రామానికి నిత్యం వయా మంబాపూర్ మీదుగా ఆర్టీసీ బస్సు నడుస్తోంది. అంతే కాకుండా ఈరోడ్డుపైన లారీలు కూడా అధికంగానే తిరుగుతుంటాయి. మంబాపూర్ నుంచి జనగాం గ్రామానికి వెళ్లే రోడ్డుపైన చాలాచోట్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు రోడ్డుపైకి వచ్చాయి. ఒకవాహనం వెళ్తుంటే మరో వాహనం దాటడం కష్టంగా మారుతోంది. ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి బైక్‌పై వెళ్తున్న వారికి ముళ్లల గుచ్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదేవిధంగా ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వెంటనే ముళ్ల పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బషీరాబాద్: మండలంలోని జీవన్గి ప్రధాన ఆర్అండ్‌బీ మార్గంలో ఇరువైపులా ముళపొదలు రోడ్డును కప్పేస్తున్నాయి. ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నప్పుడూ ఎదురుగా వచ్చే వాహనాలు కలినిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పలుచోట్ల మూలమలుపులు ఉండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని వాహనదారులు భయం గుప్పిట్లో ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముళ్ల పొదల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


మంబాపూర్ సమీపంలో రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలు


బషీరాబాద్: జీవన్గిలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు

ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయురాలు

● ఒకే గదిలో బోధన


ఐనెల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు బోధిస్తున్న ఒకే ఉపాధ్యాయురాలు


తాండూరు రూరల్, జూలై 5: తాండూరు మండలం ఐనెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఒకేఉపాధ్యాయురాలితో కొనసాగిస్తున్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతోంది. మొత్తం 43మంది విద్యార్థులు చదువుతుండగా శుక్రవారం 34మంది విద్యార్థులు హాజరయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి బదిలీపై గోనూరు పాఠశాలకు వెళ్లారు. మరో ఉపాధ్యాయురాలు శ్వేతారాణి ఫిబ్రవరి నెల నుంచి మెటర్నిటీ సెలవుల్లో ఉన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా బషీరాబాద్ మండలం నవాంద్గి పాఠశాల నుంచి ఉపాధ్యాయురాలు పాపమ్మ శుక్రవారం ఐనెల్లి పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఒకే తరగతి గదిలో ఐదు తరగుతులకు బోధిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో వెంకటయ్యను వివరణ కోరగా 30మంది విద్యార్థుల కన్నా ఎక్కువ విద్యార్థులు హాజరైతే మరో పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని ఐనెల్లి పాఠశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఐనెల్లి పాఠశాలకు ప్రభుత్వం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించిందని తెలిపారు. ఇందులో ఒకరు మెటర్నిటీ సెలవుల్లో ఉండటంతో ప్రస్తుతం ఒక ఉపాధ్యాయురాలితో పాఠశాల కొనసాగుతున్నట్లు చెప్పారు.


ఒలంపియాడ్‌లో పరిగి విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

పరిగి, జూలై 5: సెమ్స్ ఒలంపియాడ్‌లో పరిగి విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. పరిగిలోని శ్రీసరస్వతిశిశుమందిర్‌లో ఐదవతరగతి చదువుతున్న ఇ.శ్రీవర్ధన్, ఎన్ అర్జున్‌లు రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌లో పరీక్షలు రాశారు. అయితే రాష్ట్రస్థాయిలో శ్రీవర్ధన్ ఐదవర్యాంకు, అర్జున్ ఆరవర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఇద్దరు విద్యార్థులకు నగదుతోపాటు, మెమోంటో, మెడల్స్, ధ్రువీకరణ పత్రాలను పాఠశాల హెచ్ఎం మల్లేశ్‌తోపాటు, ఉపాధ్యాయ బందం సన్మానించింది.



ఒలంపియాడ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం









నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్ శరత్

వికారాబాద్, జూలై 5: గురుకుల ఆశ్రమ, గిరిజన హాస్టళ్లలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మంచి భోజనం అందించాలని గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్ ఏ.శరత్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గురుకుల, గిరిజన హాస్టల్ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ఎవరైతే పరీక్షలు రాసి లిస్ట్‌లో పేర్లు ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి అడ్మిషన్లు ఇవ్వాలని అన్నారు. పాత టెండర్లను పిలిచి ఈ నెలఖారు వరకు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో క్లస్టర్ వారీగా వంట వారిని గుర్తించి వారికీ శిక్షణ ఇవ్వాలని సూచించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, లేదంటే వారి ఆరోగ్యం పాడవుతుందన్నారు. పిల్లల ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. సన్న బియ్యం సరఫరా అయ్యేలా సివిల్ సప్లయ్ అధికారులు చూడాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయ పాలన పాటించాలన్నారు. జిల్లాలో హాస్టళ్లు, కేజీబీవీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు తన దృష్టికి రాకూడదన్నారు. హాస్టల్ నిర్వహణ పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. హాస్టళ్లలో ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు డ్రెస్‌లు కుట్టించి అనుకున్న సమయం లోపల పంపిణీ చేయాలని ఆదేశించారు. బదిలీల జీవో వచ్చినందున జిల్లా స్థాయిలో అధికారులంతా సమావేశం ఏర్పాటు చేసుకొని ఆప్షన్ తీసుకొని పోస్టింగ్ ప్రిపేర్ చేయాలన్నారు. ప్రతీ హాస్టల్, గురుకులాల్లో ఒక ఏఎన్ఎం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌సీవో స్కూల్స్ వారిగా రిజిస్టర్ పెట్టి అనారోగ్యానికి గురైన పిల్లల పేర్లు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన సౌకర్యాలని కల్పిస్తామన్నారు. తద్వారా వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తాగునీటిపైన ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పారు. హాస్టళ్లు, కేజీబీవీ పాఠశాలలకు నాణ్యమైన బియ్యం వచ్చేలా చూస్తామని, తాగునీరు, శానిటేషన్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. అన్ని విషయాలపై దృష్టిసారించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, ఎస్సీ వెల్ఫేర్ హేమలత, జిల్లా ఎస్సీ, సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, గిరిజన సంక్షేమ హాస్టల్ వార్డెన్లు, గురుకుల ప్రిన్సిపాల్‌లు, ఆర్‌సీవో సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్.ఏ.శరత్


శంకర్‌పల్లి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

బస్సులు నడపాలని విద్యార్థుల నిరసన

శంకర్‌పల్లి, జూలై 5 : బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, బడి వేళల్లో బస్సులు నడపాలని టీఏఎస్ఎస్ మండల కమిటీ అధ్యక్షురాలు మానస, ఉపాధ్యక్షురాలు పావనిలు ఆవేదన వ్యక్తం చేశారు. టీఏఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం శంకర్‌పల్లి చౌరస్తాలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్వేద, అంతప్పగూడ, సంకేపల్లి, మాసానిగూడ తదితర గ్రామాలకు బస్సులు రాకపోవడంతో శంకర్‌పల్లితో పాటు నగరానికి వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నదని వాపోయారు. ఆటోల్లో వెళితే సమయానికి కళాశాలలకు చేరేందుకు ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం వెంటనే ఉపకార వేతనాలను అందజేయాలని డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి నుంచి హైదరాబాద్ వరకు విద్యార్థుల(బాలురు)కు ఉచిత బస్‌పాస్‌లు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్, జూలై 4 : తెలంగాణ ప్రభుత్వ జ్యోతిరావు పూలే(సాతంరాయి-కందుకూరు) పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జంగం విరూపాక్ష తెలిపారు. కాగా, కళాశాల కందుకూరుకు మంజూరైందని, అక్కడ సరైన స్థలం లేక శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సాతంరాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ, ఎంఎస్ఏఐ అండ్ ఎంఎల్, బీఎస్సీ (బీజెడ్‌సీ), బీకాం (సీఏ), బీఏ (ఐఆర్ఈపీ), బీబీఏ డిగ్రీ కోర్సులు ఇంగ్లీషు మీడియంలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ కొరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 10వ తేదీ లోపు కళాశాలకు నేరుగా వచ్చి అడ్మిషన్లు పొందగలరని తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత హాస్టల్, పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9502842482, 9491694218, 8341905950 నెంబర్లను సంప్రదించాలని కోరారు.


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రాజు, తదితరులు

దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి

» ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి జర్కోని రాజు

ఆదిభట్ల, జూలై 5 : ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి జర్కోని రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జర్కోని రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 జనవరి నుంచి పెంచిన కొత్త పింఛన్లు అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీ మాత్రం అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హామీ అమలు కోసం రాష్ట్రంలో సుమారు 45 లక్షల మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని అన్నారు. 2011 ప్రకారం కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లలో తమ వాటాకింది కేవలం రూ.300 మాత్రమే ఇస్తుందని పెరిగిన ధరల సూచీకి ఇది ఏమాత్రం సరిపోదన్నారు. కేంద్ర ప్రభుత్వం వాటాను రూ.300 నుంచి రూ.3000లకు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ నాయకులు మహేష్ గౌడ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ జయంత్యుత్సవాలు

ఆదిభట్ల, జూలై 5 : ఈనెల 8న ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉక్కుల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను గుర్తించి, వారికి కమ్యూనిటీ పారా మెడికల్ శిక్షణ ఇప్పించారని, వారి కుటుంబాలకు భరోసా ఇచ్చారని అన్నారు. ఈనెల ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కమ్యూనిటీ పారామెడిక్ వైద్యులకు పిలుపునిచ్చారు. ఆర్ఎంపీ, పీఎంపీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు పేదలకు నిత్యవసర సరుకులు, పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అనాథలు, రోగులకు పండ్లు పంపిణీ చేసి మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఉక్కుల అశోక్ పేర్కొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



చౌదరిగూడ, జూలై 5: మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గ్రామానికి చెందిన పద్మకు శుక్రవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది గ్రామానికి చేరుకొన గర్భిణీని కొందుర్గు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువవడంతో ఈఎంటీ దాసరి సాయికృష్ణ, పైలెట్ యాదయ్యతో కలిసి ప్రసవం చేశారు. ఆ మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని 108 సిబ్బంది తెలిపారు. చికిత్స నిమిత్తం కొందుర్గు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు.

చటాన్‌పల్లి రైల్వే గేట్‌కు మరమ్మతులు


చటాన్‌పల్లి రైల్వే గేట్

షాద్‌నగర్, జూలై 5 : రైలు పట్టాల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం చటాన్‌పల్లి రైల్వే గేట్‌ను తాత్కాలికంగా మూసి వేసినట్లు షాద్‌నగర్ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే గేట్ మీదుగా దూసకల్, బుచ్చిగూడ, పౌల్ట్రీ ఫామ్స్‌కు వెళ్లే వాహనదారులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు.

మంచంపట్టిన విద్యార్థులు

» గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

» 14 మందికి విద్యార్థులకు వాంతులు, విరోచనాలు

» వసతి గృహంలోని పరిసరాలు, మరుగుదొడ్లు అధ్వానం

వికారాబాద్, జూలై 5: గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 14 మంది ఆసుపత్రి పాలుకాగా మరి కొంత మంది హాస్టల్‌లో మంచాన పడ్డ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వికారాబాద్ అనంతగిరి పల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా విద్యార్థులు వాంతులు, విరోచనాలతో బాధ పడుతున్నారు. శుక్రవారం 14 మంది విద్యార్థులకు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. అదే సమయంలో పాఠశాలలో విద్యార్థులు చాలా వరకు మందులు వేసుకుని మంచంపై పండుకున్నారు. హాస్టల్ ఆహారం కలుషితం కావడం, పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులు అస్వస్థకు గురైనట్లుగా తెలుస్తోంది. పాఠశాలలో మరుగుదొడ్లు పూర్తిగా అధ్వానంగా ఉండడం, వాటికి కనీసం డోర్లు కూడా లేక పోవడంతో కంపు కొడుతున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. పరిసరాలు చెత్తాచెదారంతో అధ్వానంగా మారాయి. అధికారులు పాఠశాలను సందర్శిస్తే అసలు విషయాలు బయట పడుతాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

తల్లిదండ్రులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు: స్పీకర్

తల్లిదండ్రులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకుంటున్నారని, రేపటి వరకు విద్యార్థులు అందరూ బాగవుతారని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా అనంతగిరి పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలియడంతో కలెక్టర్ ప్రతీక్ జైన్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆ తర్వాత అనంతగిరి పల్లి పాఠశాలకు వెళ్లిఅక్కడ పరిసరాలను పరిశీలించారు. కిచన్ హాల్, మరుగుదొడ్లు అన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ. 2012లో నేను తీసుకొచ్చిన పాఠశాల అని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పాఠశాలను ఎవరూ పట్టించుకోలేదన్నారు. పాఠశాలలో కొన్ని మరమ్మతులు చేయాల్సి ఉందని, మరుగుదొడ్లు బాగు చేయాల్సి ఉందన్నారు. అవసరమైతే ప్రభుత్వ నిధులు లేక పోతే మా నిధులు లేదా కలెక్టర్ నిధుల ద్వారా వీటిని బాగు చేయడం జరుగుతుందన్నారు. నలుగురు విద్యార్థులు ఒక మంచం మీద పంటున్నారని ఇద్దరు విద్యార్థులు ఒక మంచం మీద పండే విధంగా కొత్త మంచాలు తెస్తామని, వార్డెన్ లేదని, ప్రిన్సిపాల్ ఉండడంతో కొంత ఇబ్బందిగా ఉందన్నారు. స్పీకర్ వెంట సంబంధిత శాఖల అధికారులు, డీఎంహెచో పాల్వాన్‌కుమార్, మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, కిషన్ నాయక్, రాంచందర్ రెడ్డి, మురళి, ఆసిప్, వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు.


చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న స్పీకర్

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన స్పీకర్

విద్యార్థులతో మాట్లాడిన అనంతరం స్పీకర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు అధికారులు ప్రజా ప్రతినిధులు విద్యార్థులతో భోజనం చేశారు. వారితో కలిసి కూర్చోని భోజనం చేశారు.

పాఠశాలను సందర్శించిన డీఎంహెచ్‌వో

విద్యార్థుల అస్వస్థత విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వాన్ కుమార్ పాఠశాలకు వెళ్లి విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న స్పీకర్, కలెక్టర్



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోవర్ధన్ మృతి పట్ల సీఎం సంతాపం

» కోస్గికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్, జూలై 5: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ చింతల గోవర్ధన్ రెడ్డి గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో కోస్గి మండంలోని పోతిరెడ్డిపల్లికి చేరుకొని ఆయన మృతికి సంతాపం తెలిపి కుటుంబసభ్యులను పరామర్శించారు. గోవర్ధన్‌రెడ్డి టీడీపీలో సీనియర్ నాయకుడిగా సేవలందించినప్పటి నుంచి రేవంత్ రెడ్డితో సన్నిహితంగా ఉంటూ వచ్చారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, సోదరుడు, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి గోవర్ధన్‌రెడ్డి మృతి పంట్ల సంతాపం తెలిపారు. గోవర్ధన్‌రెడ్డి కుటుంబానికి పార్టీపరంగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న పామెన భార్గవరామ్

కార్యకర్తలను విస్మరిస్తే ఊరుకోం

షాబాద్, జూలై 5 : ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ కార్యకర్తలను విస్మరిస్తే ఊరుకునేదిలేదని డీసీసీ ప్రధానకార్యదర్శి పామెన భార్గవరామ్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య, యూత్ కాంగ్రెస్ డివిజన్ ఇన్‌చార్జి పెంటారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింహులు, పార్టీ సీనియర్ నాయకులు తమ్మలి రవీందర్, అక్తర్‌పాష తదితరులతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీని నిలబెట్టి, జెండాలను భుజాలపై మోసి పార్టీని నిలబెట్టిన కార్యకర్తలు, నాయకుల పట్ల బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే యాదయ్య ఒంటెద్దు పోకడలు పోతే ఊరుకునేదిలేదన్నారు. ఇటీవల మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుని ఇంట్లో విందు చేయడం దేనికి సంకేతమన్నారు. హైకమాండ్ తీసుకునున్న నిర్ణయాలకు మేము కట్టుబడి ఉన్నాం కానీ, పార్టీ కోసం కష్టపడ్డవాళ్లను పక్కన పెడితే చూస్తూ ఊరుకునేదిలేదన్నారు. ఎలాంటి అభివృద్ధి పథకాలు అమలైన నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ నాయకులను కలుపుకొని ముందుకు పోవాలన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లేష్, మండల ప్రధానకార్యదర్శి శ్రీరాంరెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, నాయకులు తదితరులున్నారు.


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో అండేకార్ యాదిలాల్

కిషన్‌రెడ్డిని కలిసిన యాదిలాల్

ఆమనగల్లు, జూలై 5: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డిని శుక్రవారం ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు యాదిలాల్ పేర్కొన్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చేలా చొరవ తీసుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆయనతో రాంకిరణ్, తదితరులు ఉన్నారు.

మట్టి ఎడ్ల సంబురాలు



కొడంగల్ రూరల్, జూలై 5: మట్టి ఎడ్ల అమావాస్యను పురస్కరించుకొని కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు మంగళవారం మట్టితో ఎడ్ల ప్రతిమలను తయారు చేసి వాటికి పూజలు చేశారు. అమావాస్య రోజు పండగ జరుపుకుంటే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, నష్టాలు లేకుండా ధాన్యలక్ష్మి ఇంటికి చేరుతుందని రైతులు విశ్వసిస్తారు.


అంగడిరైచూర్‌లో మట్టితో ఎడ్ల ప్రతిమలను తయారు చేస్తున్న రైతు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, జూలై 5: మున్సిపాలిటీల్లో సమస్యలను పరిష్కారించేందుకు పాలకవర్గాలు కృషిచేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆయన శుక్రవారం నిర్వహించిన పోచారం మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని అన్నారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలతో రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, తాగునీటి సమస్యలు ప్రధానంగా ఉంటాయన్నారు. ఉన్న వనరులతోనే ప్రధాన సమస్యలపై దృష్టిసారించాలన్నారు. వార్డులవారీగా నిధులు కేటాయిస్తే సరిపోక సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయే అవకాశమున్నందున ఒక్కొక్కటిగా పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంపీకి పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ఎన్‌టీపీసీ చౌరస్తా వద్ద భూగర్భ వంతెన నిర్మాణానికి, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రూ.1.93కోట్లతో చేపట్టనున్న పనులకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు మహేష్, ధనలక్ష్మి, రాజశేఖర్, సాయిరెడ్డి, శైలజ, బాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, లక్ష్మి, హరిప్రసాదరావు, సామల శ్రీలత, సరిత, పోచమ్మ, సుధాలక్ష్మి, బద్దం మమత, కోఆప్షన్‌సభ్యులు అక్రంఅలీ, శకుంతల, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాయిపూర్ బాల్‌రెడ్డి

» ఉత్తర్వులు జారీ చేసిన మార్కెటింగ్ శాఖ

» రెండేళ్ల పాటు పాలకమండలి గడువు


బాల్‌రెడ్డి

తాండూరు, జూలై 5: జిల్లాలోనే పెద్దదైన తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రకటిస్తూ శుక్రవారం సాయంత్రం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జీవోను జారీచేసింది. తాండూరు పట్టణం సాయిపూర్‌కు చెందిన పట్లోళ్ల బాల్‌రెడ్డిని చైర్మన్‌గా, వైస్‌చైర్మన్‌గా మదికొండ నర్సిరెడ్డిని నియమించారు. సభ్యులుగా ఎండీ అజ్మత్ అలీ, కె.జర్నప్ప, రాథోడ్ తులసీరాం, మహమ్మద్ ఖరీం, కొటం ఉదయ్ భాస్కర్‌రెడ్డి, ఈడ్గి నర్సింహగౌడ్, ఉప్పరి మొగులయ్య, బిస్మిల్లా, బి.గొనెగొరి శ్రీనివాస్, మేకల రాజు, సీహెచ్ బొజిరెడ్డి, ఎం.మాణిక్యం, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళను ప్రకటిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సిఫారసు మేరకు ఈ పాలకవర్గం గడువు రెండేళ్లు ఉంటుందని అధికారుల ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాధవరెడ్డి


జి.మాధవరెడ్డి


చందర్

బషీరాబాద్: బషీరాబాద్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జి.మాధవరెడ్డి(జీవన్గి) నియమితులయ్యారు. ఈమేరకు ఏపీసీ, మార్కెటింగ్ కమిటీ శాఖ కార్యదర్శి రాఘునందన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. వైస్‌చైర్మన్‌గా మూడవత్ చందర్, డైరెక్టర్లుగా ఎన్.నరేష్, షేక్ మునీర్ అహ్మద్, నదీర్గా మోహన్, నరేష్‌రథోడ్, సోంపల్లి వనమాల, కె.మహేందర్‌రెడ్డి, వడ్డేహన్మంతు, పీకే.పెంటప్ప, అగ్గనూర్ సతీష్, కోవ్వూరి నరేష్, ఈ.పాండురంగ, అనూప్‌ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, బషీరాబాద్ పంచాయతీ ప్రత్యేకాధికారి రమేష్ పేర్లను ప్రకటించారు.

జనగాం గ్రామాన్ని సందర్శించిన ఎన్ఏఏఏ బృందం

» పంచాయతీల ఆడిట్ నిర్వహణపై పరిశీలన

పెద్దేముల్, జూలై 5: మండలంలోని జనగాం గ్రామాన్ని సిమ్లాకు చెందిన నేషనల్ అకాడమి ఆఫ్ ఆడిట్ అండ్ అకౌంట్స్ (ఎన్ఏఏఏ)డైరెక్టర్ డాక్టర్ నంద దులాల్‌తో పాటు ఇద్దరు ఏజీడీ ట్రైనర్స్ డిప్యూటి అకౌంట్ జనరల్ డాక్టర్ కామినేని సంజయ్‌రావుతో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీల రికార్డులు, ఆడిట్ నిర్వహణ, పరిపాల విధానంపై ఆరాతీశారు. ఏప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. టెండర్లు వేస్తారా లేక నేరుగా పనులు చేస్తారా? అని అడిగి తెలుసుకున్నారు. వారికి డీఎల్పీవో శంకర్‌నాయక్ అన్ని విషయాలను వివరించారు. పంచాయత్‌రాజ్ వ్యవస్థ, గ్రామీణప్రాంతాల్లో అమలవుతున్న ప్రభుత్వ విధానాలు, ప్రభుత్వ పథకాల గురించి వారికి తెలిపారు. గ్రామంలో తాగునీటి వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, నర్సరీ, కంపోస్ట్ షెడ్డు, వంటి వాటిని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు విద్యాబోధన ఏవిధంగా జరుగుతుందో పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆడిట్ ఆఫీసర్స్ శేఖర్, గౌతమ్‌కుమార్, రాజేంద్ర ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీఈవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు మల్లిఖార్జున్, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


జనగాం గ్రామంలో పర్యటించిన ఎన్ఏఏఏ బృందం

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

వికారాబాద్, జూలై 5: పెండింగ్‌లో ఉన్న 7,200 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్‌రావు అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోతే ముఖ్యమంత్రితో పాటు మంత్రులను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మహేష్, విద్యార్థి నాయకులు ఆదికేశ్, రాజేందర్, మురళి, కార్తీక్, సంజు, నరేందర్, అక్షిత్, హరికృష్ణ, దయాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్ రెడ్డి అన్నారు. బీజేవైఎం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కష్టంతోఅధికారంలోకి వచ్చిందని ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు వివేకానందారెడ్డి, ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నేతల ముందస్తు అరెస్ట్

తాండూరు: బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి పిలుపుతో పోలీసులు అలర్ట్ అయ్యారు. శుక్రవారం విద్యార్థి సంఘ నేతలను తాండూరు పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌చేశారు. తాండూరు పోలీస్‌స్టేషన్‌కు త రలించారు. అరెస్ట్ అయిన వారిలో వికారాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయరావు, తాండూరు పట్టణ శాఖ బీఆర్ఎస్‌వి అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు రజక నర్సింహులు ఉన్నారు.



తాండూరు: అరెస్టయిన విద్యార్థి సంఘం నేతలు

పూడూరు: కలెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా పూడూరు మండల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శుక్రవారం బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరుద్యోగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ కంకల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కన్నయ్యోల్ల రాజు, బీజేవైఎం అసెంబ్లీ కో-కన్వీనర్ మనోహర్‌లు కలెక్టరేట్ ముట్టడికి తరలివెళుతుండగా చెన్‌గోముల్ పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కులకచర్ల: నిరుద్యోగుల టీజీపీఎస్సీ ముట్టడి పిలుపు నేపథ్యంలో శుక్రవారం కులకచర్ల పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల సంఘం నాయకులు షైపాల్, రమేశ్‌నాయక్ మాట్లాడారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



పూడూరు: చెన్‌గోముల్ పోలీసుస్టేషన్ వద్ద బీజేపీ నాయకులు



కులకచర్ల: పోలీసుల అదుపులో నిరుద్యోగ యువకులు

క్రైం కార్నర్

వరుస చోరీలు.. భయాందోళనలో ప్రజలు

● తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలు



ఏర్పుమళ్ల గ్రామంలో చోరీపై విచారణ చేస్తున్న పోలీసులు



ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

బొంరాస్‌పేట్, జూలై 5: మండలంలో ఇటీవల వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి ఏర్పుమళ్ల గ్రామంలో మూసి ఉన్న మూడు ఇళ్ల తాళాలు విరగొట్టి బంగారు, నగదు అపహించుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్పుమళ్ల గ్రామానికి చెందిన వార్ల రమేశ్ తన మామ అంత్యక్రియల నిమిత్తం వెళ్లాడు. ఇదే అదనుగా గుర్తుతెలియని దుండగులు రమేశ్ ఇంటితాళం విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి రూ.4లక్షలు, 10 తులాల బంగారు అభరణాలతో పాటు వెండిని అపహరించారు. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా, అదే గ్రామంలో నర్సమ్మ ఇంటి పక్కన ఇటీవల ఓ వ్యక్తి మృతి చెందడంతో వారు భయాందోళనతో వేరే ఇంట్లో నివాసముంటున్నారు. దీంతో దొంగలు ఆమె ఇంటితాళం విరగొట్టి రూ.50వేల నగదు, రెండున్నర తులాల బంగారు అభరణాలు అపహరించారు. అదేగ్రామానికి చెందిన బుడగ జంగం మాసప్ప ఇంట్లో దుండగులు రూ.11వేలు దొంగిలించారు. అదేగ్రామానికి చెందిన తురక బువ్వమ్మ ఇంట్లో రూ.90వేలు, నక్కలి వెంకటమ్మ ఇంట్లో రెండు తులాల బంగారం, బాపల్లి హనుమంతు ఇంట్లో రెండు తులాల బంగారం, వెండి నగలు, కోస్గి అంజిలమ్మ ఇంట్లో రెండు తులాల బంగారం, రూ.40వేల నగదును అపహరించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆదివారం రాత్రి కూడా ఏర్పుమళ్ల సమీపంలోని బోరబండ తండా, నాందార్‌పూర్ గ్రామాల్లో ఇళ్ల తాళాలు విరగొట్టి దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. గ్రామాల్లో జరిగిన చోరీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మహిపాల్‌రెడ్డి (ఫైల్)

మర్పల్లి, జూలై 5: క్రిమిసంహారక మందు తాగి ఓవ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బూచన్‌పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బూచన్‌పల్లి గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి(33) వృత్తి రీత్యా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 3న కుటుంబసభ్యులతో కలిసి తన కారులో ఓ విందుకు హాజరై తిరిగి కారులో వస్తూ సిరిపూరం గ్రామంలో ఓవ్యక్తిని ఢీకొట్టాడు. ఆవ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డికి తరలించారు. ఆ వ్యక్తిని కారుతో ఢీకొట్టినప్పటి నుంచి మహిపాల్ ఏం అవుతుందోనని మానసికంగా ఆందోళన చెందాడు. దీంతో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మర్పల్లి ఏఎస్సై మల్లేశం తెలిపారు.

నేడు నల్సర్‌కు సీఎం, హైకోర్టు సీజే రాక

శామీర్‌పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మేడల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సర్ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం(నేడు) సాయంత్రం 4గంటలకు క్యాపిటల్ ఫౌండేషన్ వార్షిక ప్రసంగం, అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నల్సర్ రిజిస్ట్రార్ శ్రీకృష్ణదేవరావు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గౌరవ అతిథిలుగా నల్సర్ చాన్స్‌లర్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(చీఫ్ జస్టిస్) అలోక్‌అరదే, అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా డాక్టర్ వెంకటరమణి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పట్నాయక్‌లు విచ్చేస్తున్నట్లు రిజిస్ట్రార్ వివరించారు.

మహిళలు సొంత కాళ్లపై నిలబడాలి



కుట్టుమిషన్ పత్రాలను అందజేస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్

వికారాబాద్, జూలై 5: మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడి, ఆర్థికంగా ఎదగాలని వికారాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ అన్నారు. శివరాంనగర్‌కాలనీలో నిర్మన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 31వ వార్డు కౌన్సిలర్ మాలే గాయత్రి 80 మందికి కుట్టుమిషన్ శిక్షణాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గాయత్రి లక్ష్మణ్, కౌన్సిలర్ చందర్ నాయక్, కోఆర్డినేటర్ రిత్విత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న తట్టెపల్లి గ్రామస్తులు

పెద్దేముల్, జూలై 5: అంబురామేశ్వర ఆలయానికి సంబంధించిన భూములను కాపాడాలని తట్టెపల్లి గ్రామస్థులు శుక్రవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. పెద్దేముల్ మండలం అంబురామేశ్వర దేవాలయం సమీపంలో గల సర్వేనంబర్ 265లో సుమారు 4.15ఎకరాల భూమి అంబురామేశ్వర ఆలయానికి సంబంధించినదేనని, కొందరు వ్యక్తులు అది తమ వారుసులకు చెందిన భూమిగా పేర్కొంటూ పట్టాకోసం తిరుగుతున్నారని చెప్పారు. అధికారులు ఆభూమిని ఎవరికీ పట్టా చేయొద్దని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ స్పందిస్తూ.. సర్వేనంబర్ 265 కాస్రుప్రకారం పట్టాఉన్నా అందులో ఎవరూ కబ్జాలో లేరని తెలిపారు. నరోత్తంరావు అనే వ్యక్తి పట్టాకోసం 35గుంటలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తాము ఆ దరఖాస్తును తిరస్కరించామని తెలిపారు.

విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు బుక్కులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దోమ, జూలై 5: అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దోమ మండలంలోని మెట్టుగడ్డతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్ మ్యాట్‌లు, నోటుబుక్‌లు, షూస్, బ్యాగ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాకేశ్, సంస్థ ప్రతినిధులు శ్రీశైలం, పాత్రికేయుడు గిరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి పాఠశాలలో ఉండాలి



విద్యార్థితో బోర్డుపై రాయిస్తున్న ఎంఈవో

తాండూరు రూరల్, జూలై 5: ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి పాఠశాలలో ఉండాలని తాండూరు మండల ఎంఈవో వెంకటయ్య అన్నారు. మండలంలోని చెంగోల్, పర్వతాపూర్, గౌతాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన తనఖీ చేశారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. అనంతరం పాఠ్యపుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలను చదివించారు. చెంగోల్ పాఠశాలలో విద్యార్థులతోపాటు మహిళా ఉపాధ్యాయులకు టాయిలెట్లు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో దృష్టికి తెచ్చారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని హెచ్ఎంను ఆదేశించారు. పాలిషింగ్ యూనిట్‌లో పనిచేసే కార్మికులు పిల్లలు ఉండటంతో వారు వలస వెళ్లడంతో హాజరుశాతం తగ్గిందని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. పరిశుభ్రమైన పాత్రల్లో వంట చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు కిష్టప్ప, లీలావతి పాల్గొన్నారు.

ఇటొస్తే సర్కస్ ఫీట్లే

● ఎగుడు దిగుడుగా రోడ్లు , అసంపూర్తి డ్రైనేజీ
● చిన్న వర్షానికే చెరువును తలపించే రోడ్లు
● భవానీనగర్ కాలనీ వాసుల అవస్థలు
● పట్టించుకోని పాలకులు, అధికారులు

తాండూరు, జూలై 5: ఆ కాలనీలో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కాలనీలో మురుగు కాల్వలు, రోడ్లు అసంపూర్తిగా ఉండటంతో వర్షం కురిస్తే జలమయంగా మారుతోంది. తాండూరులోని భవానీనగర్ కాలనీలో దుస్థితి ఇది. ఈ కాలనీలోని దర్గా నుంచి ఆయుర్వేద ఆస్పత్రి వరకు, షాదీఖానా వెనుక భాగం నుంచి మట్టిరోడ్లు దర్శనమిస్తాయి. ఈరోడ్లు అడుగడుగునా గుంతలు ఏర్పడి, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక వర్షం కురిసినప్పుడు వర్షపు నీరంతా రోడ్డుపైకి వస్తోంది. బాలికల హాస్టల్ వద్ద నిర్మించిన డ్రైనేజీ కూడా చిన్నదిగా ఉంది. అదీ అసంపూర్తిగానే వదిలేశారు. వర్షం వచ్చిందంటే ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితిని ఈ ప్రాంతవాసులు ఎదుర్కొంటున్నారు. గల్లీల నుంచి బయటికి వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. ఈ కాలనీలోని ఉన్న చిన్నపాటి మురుగు కాల్వల్లో నిండిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గత ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి రోడ్లపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా తయారవుతుందని, రాకపోకలకు ఇబ్బందులు ఏర్పాడుతుందని కాలనీవాసులు తెలిపారు. రాయల్‌కాంట నుంచి కార్నర్ వరకు ఉన్న మురుగుకాల్వను నెలరోజులైన శుభ్రం చేయడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇంత వరకు తమ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు వరద కష్టాలను తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న వర్షపునీరు

కొత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మేడ్చల్ టౌన్/మూడుచింతలపల్లి/ శామీర్‌పేట, జూలై 5: మేడ్చల్ విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలోని శామీర్‌పేట మండలం లాల్‌గడీ మలకపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పరఫరా సామర్థ్యం పెంచడానికి రూ.6కోట్లు వెచ్చించి కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం 50ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 80ఎంవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నాలుగు రోజులు విద్యుత్ అంతరాయం

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపడుతున్నందున డివిజన్ పరిధిలోని జినోమివ్యాలి పారిశ్రామికవాడ, శామీర్‌పేట మండలం, మూడుచింతలపల్లి మండలం, మేడ్చల్ పారిశ్రామికవాడ, మేడ్చల్ మండలం పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపట్టే నేపథ్యంలో నాలుగురోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు.



లాల్‌గడి పరిధిలో కొత్తగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గుర్తింపులేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ జూలై 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గుర్తింపులేని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డీఈవో విజయకుమారికి శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా గుర్తింపులేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు వినతిపత్రం రూపంలో అందజేసినా ఫలితం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 15మండలాలల్లో అనేక గుర్తింపు లేని పాఠశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఈవోను కలిసిన వారిలో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులున్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జీవన్గిలో భూముల పరిశీలన

బషీరాబాద్, జూలై 5: జీవన్గి గ్రామ శివారులోని భూములను బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన దళిత రైతులకు అప్పట్లో ప్రభుత్వం సర్వేనంబర్‌లోని 162లో 94 ఎకరాల భూమి ఇవ్వగా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. కొందరికి పట్టాపాసు పుస్తకాలు ఉండగా, ధరణి పాసుపుస్తకాలు అందలేదు. ఈ క్రమంలో రైతులు ప్రభుత్వం అందించే రైతుబంధు అందక నష్టపోతున్నారు. ఈ సమస్యను పరిష్కారించాలని రైతులు గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరగుతున్నారు. ఇటీవల బాధిత రైతులు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలువగా ఆర్డీవో, తహసీల్దార్‌లతో మట్లాడి అర్హులైన వారికి పాసుపుస్తకాల జారీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశంతో కలిసి వర్షాన్నీ లెక్క చేయకుండా ఆయా భూములను స్వయంగా పరిశీలించారు. ట్రాక్టర్‌పై ఎక్కి 2కిలోమీటర్ల దూరం పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా..

● **కులకచర్ల:** చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దేవులనాయక్ పదవీ విరమణ సమావేశాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, దోమ ఎంఈవో హరిశ్చందర్, మాజీ సర్పంచ్ చంద్రయ్య, స్థానికులు పాల్గొన్నారు.

● **కులకచర్ల:** తమ సమస్యలు పరిష్కరించాలని మండల పంచాయతీ కార్మికులు శుక్రవారం గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందించారు. నాలుగు నెలల నుంచి తమకు వేతనాలు అందడం లేదని తెలిపారు. డబ్బులు ఇవ్వకపోవడంతో కిరాణ కొట్టు వారు సరుకులు ఇవ్వడం లేదని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

● **బొంరాస్‌పేట్:** కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ చేతుల మీదుగా శుక్రవారం నేనావత్ వినోద్‌కు రూ.లక్షతో పాటు పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంతోష్, మోత్యానాయక్, రాములు, గోపాల్‌రెడ్డి, రవినాయక్, మోతిలాల్, అలీమ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● **యాలాల:** మండల ప్రత్యేక అధికారిగా మార్కెటింగ్ ఏడీ సారంగపాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

● **మేడ్చల్ టౌన్:** గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీల ఎన్నికలు నిర్వహించి ప్రత్యేక అధికారుల పాలన నుంచి విముక్తి కల్పించాలని మేడ్చల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం నగర శివారు ప్రాంతంలోని పంచాయతీలను మహానగరం పేరిట గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసి స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిగా రద్దు చేసే కుట్ర పన్నుతుందని ఆరోపించారు. సర్పంచ్, ఎంపీటీసీల పాలన గడువు ముగియటంతో గ్రామాల్లో ప్రజాసమస్యల గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు.

● **మేడ్చల్ టౌన్:** యువకుల జీవాలతాలతో చెలగాట మాడుతున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రేతలను పట్టుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం మేడ్చల్ సీఐ సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. మేడ్చల్‌లో గంజాయి మత్తుకు ఎందరో యువకులు బానిసై అనారోగ్యంతో బాధ పడుతున్నారని తెలిపారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు విక్రయించే వారిని పట్టుకోవడానికి మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా నిఘా టీమ్‌ను ఏర్పాటు చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు. గంజాయి విక్రయించే వారి గురించి తమకు సమాచారమివ్వాలని కోరారు.

● **మోమిన్‌పేట్:** డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సూచన మేరకు మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని శ్రీ దుర్గమాత ఆలయం దగ్గర పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పి.చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు షైపాల్, యం.నర్సింహారెడ్డి, బీ.శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, లింగారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నవాబుపేట: బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని పార్టీ మండల అధ్యక్షుడు కందాడ నాగిరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దయాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, పురుషోత్తం, ఎక్‌మామిడి నాయకులు భరత్‌రెడ్డి, న్యాలం ప్రకాశం, అడ్వకేట్ పోలీసు మహేశ్వర్‌రెడ్డి, శాంత్‌కుమార్, అఫ్సర్ ఖాన్, శ్రీకాంత్‌గౌడ్, నర్సింహారెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీకాంత్, ధర్మయ్య, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** మండలంలోని దామర్‌చెడ్ గ్రామంలో భవానీమాత ఆలయంలో మట్టిఎడ్ల అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి శంకర్ స్వామిజీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు స్వామిజీ ప్రవచనలు వినిపించారు. అనంతరం ఆలయ కమిటీ తరపున ప్రసాదవితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

● **తాండూరు:** మాజీ మంత్రి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కొప్పుల ఈశ్వర్ శుక్రవారం సాయంత్రం తాండూరుకు వచ్చారు. వ్యాపారపని నిమిత్తం వచ్చిన ఆయన స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్‌తో ఉన్న పాత పరిచయాలతో ఆయన ఇంటికి వెళ్లారు. తేనీరు స్వీకరించి తాండూరులో చేపట్టబోయే వ్యాపార విషయాలకు సంబంధించి ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఎలాంటి రాజకీయ చర్చలు జరగలేదని డాక్టర్ సంపత్ కుమార్ వెల్లడించారు. డాక్టర్ సంపత్‌తో పాటు ఆయన సతీమణి, టీపీసీసీ ఓబీసీ నాయకురాలు సునిత సంపత్ ఉన్నారు.

మేడ్చల్ విద్యార్థికి అంతర్జాతీయ పురస్కారం



అంతర్జాతీయ పర్యావరణ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ మర్రి శ్రేయారెడ్డి

మేడ్చల్ టౌన్, జూలై 5 : మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి కూతురు డాక్టర్ మర్రి శ్రేయారెడ్డి బీహార్ రాష్ట్రం పాట్నాలోని ఏయిమ్స్‌లో పీజీ విద్యనభ్యసిస్తోంది. కాగా అంతర్జాతీయ స్థాయిలో నెల రోజుల పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ అంశాల పట్ల ఏయిమ్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొన్న శ్రేయ పర్యావరణం పట్ల తనకున్న అనుభవాలను విశ్లేషిస్తూ తన ప్రతిభను కనపరిచారు. దీంతో ఆమెను అంతర్జాతీయ పర్యావరణ పురస్కారానికి ఎంపిక చేసి ఏయిమ్స్ వీసీ నీలోత్పల్ బల్ అవార్డును, గుర్తింపుపత్రాన్ని అందజేశారు. తమ కూతురు డాక్టర్ శ్రేయారెడ్డికి అంతర్జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల తల్లిదండ్రులు మర్రి, దీపిక, మర్రి నర్సింహారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యమాలే ఊపిరిగా ముందుకు సాగుదాం



కొడంగల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న రవిశంకర్‌రెడ్డి

కొడంగల్, జూలై 5: ఉద్యమాలే ఊపిరిగా ముందుకు సాగుదామని రెవెల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో శుక్రవారం ఆర్ఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని జెండా ఆవిష్కరణతో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 జూలై 5 ఆర్ఎస్‌యూ ఆవిర్భవించిందని తెలిపారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణకు ఉద్యమాలే ఊపిరిగా ముందుకు నడిపిస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణతో పాటు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల వ్యతిరేకంగా అనేక పోరాటాలకు ఆర్ఎస్‌యూ నాయకత్వం వహించిందన్నారు. దేశంలోని కరువు ప్రాంతాల్లో ఉన్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు కులాలతో సంబంధం లేకుండా ఎలాంటి ఫీజులు లేకుండా అన్నిరకాల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు అందించాలనేదే ఆర్ఎస్‌యూ డిమాండ్ అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్, రాష్ట్ర సలహాదారులు శంకర్, ఉపాధ్యక్షుడు బాలు, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు చంద్రకిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

కులకచర్ల, జూలై 5: అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కులకచర్ల మండలంలోని కుసుమ సముద్రం గ్రామ ప్రజలు తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలో కొందరు ఇసుక రవాణా చేస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారని తెలిపారు. సొంతింటి నిర్మాణం పేరుతో కొందరు గ్రామసమీపంలోని వాగుల్లో నుంచి ఇసుక తీసుకొచ్చి ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా వారు చూసీచూడటనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్న చైర్మన్ అశోక్

పరిగి, జూలై 5: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. మునిసిపల్ పరిధిలోని సీజనల్ వ్యాధులపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పలుకాలనీల్లో మురికికాలువల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ప్రతీఒక్కరు ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు కిరణ్, నాయకులు మౌలానా తదితరులు పాల్గొన్నారు.